


వీరి 'పేరే'మి..! 8లో ▸
ఒకే రకమైన పేర్లు.. ఒకే ఊరిలో ఉన్న వారు చాలామందే ఉన్నారు. ఇంటి పేరు చెబితే గానీ వారి ఆచూకీ తెలియదంటే అతిశయోక్తి కాదు. ఆ పేర్ల వెనుక చరిత్ర ఏమిటో తెలుసుకుందాం.



పండ్లకు భలే గిరాకీ 9లో ▸
రంజాన్ మాసం కావడంతో పండ్లకు గిరాకీ పెరిగింది. మరోవైపు వేసవి కూడా కావడంతో ఉపశమనానికి పండ్లు తీసుకుంటారు. ఫలితంగా ధరలు పెరిగిపోతున్నాయి.

గరిష్టం/కనిష్టం
36.0 /28.0

వాతావరణం
ఉదయం ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఎండల తీవ్రత పెరుగుతుంది. సాయంత్రం వేళ ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది.



సింగరేణిని అమ్మేందుకు కుట్ర


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్, వేదికపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, చిన్నయ్య, రామన్న, బాపురావు, నాయకులు

- బొగ్గు గనుల వేలం ఆపాలి
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- సీసీసీలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ మహాధర్నా

శ్రీరాంపూర్(మంచిర్యాల): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సింగరేణిని అమ్మేందుకు కుట్ర చేస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆరోపించారు. బొగ్గు గనుల వేలం ఆపాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో నాలుగు బొగ్గు బ్లాక్‌లను కేంద్రం వేలం వేయడాన్ని నిరసిస్తూ శనివారం మంచిర్యాల జిల్లా సీసీసీ కార్నర్ వద్ద మహాధర్నా నిర్వహించారు. మోదీ హఠావో.. సింగరేణి బచావో అంటూ బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు కార్మికులకు 10శాతం లాభాలు పంచేవారని, రాష్ట్ర ఏర్పాటు తర్వాత 30శాతం పంచుతున్నామని తెలిపారు. వేల కోట్ల లాభాలు ఆర్జిస్తున్న సింగరేణిపై మోదీ కన్నుపడి బొగ్గుబ్లాక్‌లను ఆదానీకి అప్పగిస్తున్నారని విమర్శించారు. బొగ్గుబ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించినా పట్టించుకోవడం లేదని, రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు, వారి మంత్రులు నిలదీయాలని అన్నారు. ఎన్నికలతోనే వారికి బుద్ధి చెప్పాలని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ 100 సీట్లు మించి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు మాట్లాడుతూ సింగరేణిలో ముఖ్యమంత్రి కేసీఆర్ వల్ల 12వేల మందికి కారుణ్య ఉద్యోగాలు వచ్చాయని భవిష్యత్‌లో సంస్థను కాపాడుకోవాలంటే కేంద్రంతో పోరాడాలని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ మాట్లాడుతూ తెలంగాణకు సింగరేణి గుండెకాయ వంటిదని, దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ హక్కులను కాలరాస్తూ మతోన్మాద శక్తులను పెంచి పోషిస్తున్న బీజేపీ సర్కార్‌ను గద్దె దించాలని పేర్కొన్నారు.


హాజరైన పార్టీ, యూనియన్ శ్రేణులు

మోసం చేసిన ప్రధాని

– కెంగర్ల మల్లయ్య, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

ప్రధానమంత్రి నరేంద్రమోదీ కార్మిక వర్గానికి ఇచ్చిన మాట తప్పి సింగరేణిని మోసం చేశారని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య విమర్శించారు. సింగరేణిని ప్రైవేటీకరించబోమని మాట ఇచ్చిన తర్వాతనే నాలుగు బొగ్గు బ్లాక్‌లను వేలం వేశారని తెలిపారు.

తరలొచ్చిన శ్రేణులు

బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ డివిజన్ల నుంచి పెద్దయెత్తున టీబీజీకేఎస్, బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ధర్నా నిర్వహించారు. ముగింపు సమయంలో మోదీ దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. నాయకులంతా మోదీ హఠావో.. సింగరేణి బచావో అంటూ నినదిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. బీఆర్ఎస్ పార్టీ జి ల్లా ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, ఎమ్మెల్యేలు దుర్గం చిన్నయ్య(బెల్లంపల్లి), బా పురావు(బోథ్), ఆత్రం సక్కు(ఆసిఫాబాద్), జోగు రామన్న(ఆదిలాబాద్), జెడ్పీ చైర్‌పర్సన్‌లు నల్లాల భాగ్యలక్ష్మి(మంచిర్యాల), జనార్దన్ రాథోడ్(ఆదిలా బాద్), కోవ లక్ష్మి(కుమురంభీం), మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందరె డ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగుంట ప్రవీణ్, టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు ఎస్.విజిత్‌రావు, అక్కూరి సుబ్బయ్య, టీబీజీకేఎస్ నాయకులు మంద మల్లారెడ్డి, డీ. అన్నయ్య, ఏనుగు రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు వంగ తిరుపతి, పూదరి కుమార్, మర్రి రాజమౌళి, బేర సత్యనారాయణ, రేగుంట చంద్రశేఖర్, దాసు పాల్గొన్నారు.

తట్టా చెమ్మాస్ తిరగెయ్యాలే..

– బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, విప్ బాల్క సుమన్

బీజేపీ నాయకులను సింగరేణి క్షేత్రంలో తిరగనివ్వొద్దని, వస్తే తట్టాచెమ్మాస్ తిరగెయ్యాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ కార్మికులకు పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం చేస్తున్నట్లుగానే సింగరేణినీ చేయాలని కుట్ర చేశారని ఆరోపించారు. ఉక్కు ఫ్యాక్టరీకి ముడిసరుకు ఐరన్‌ఓర్ గనులను కేటాయించకుండా నష్టాలు వచ్చేలా చేశారని, ఆ పేరుతో ప్రైవేటు పరం చేస్తున్నారని తెలిపారు. ఆ తోవలోనే సింగరేణికి కొత్త గనులు ఇవ్వకుండా నష్టాల పాలు చేసి ఆదానీకి అప్పగించే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. నాలుగు బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే ఇవ్వాలని బీజేపీ మంత్రి కిషన్‌రెడ్డి, వారి ఎంపీలు ఎందుకు కేంద్రానికి లేఖ రాయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. గుజరాత్‌లో లిగ్నేట్ మైన్స్‌ను అక్కడి ప్రభుత్వం కోరగా వేలం వేయకుండా ఇచ్చిన కేంద్రం తెలంగాణలో ఎందుకు వివక్ష చూపుతోందని ప్రశ్నించారు. మైన్ రాకుంటే కారుణ్య ఉద్యోగాలు ఇచ్చుకోలేని పరిస్థితి వస్తుందని, కార్మికవర్గం కేంద్రంపై తిరగబడాలని పిలుపునిచ్చారు. మోదీ, అమిత్‌షా, బండి సంజయ్, ధర్మపురి అరవింద్ చదువు ఫేక్ సర్టిఫికెట్లేనని, వారి బండారం బయటపెట్టబోతున్నామని తెలిపారు.

బీఆర్ఎస్ కార్యాలయాన్ని సందర్శించిన విప్


కార్యాలయాన్ని సందర్శిస్తున్న బాల్క సుమన్

నస్పూర్: పట్టణంలో నిర్మిస్తున్న బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ శనివారం సందర్శించారు. కార్యాలయం పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పార్టీ కార్యాలయాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కౌన్సిలర్లు వంగ తిరుపతి, బేర సత్యనారాయణ, చిదం మహేశ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: ఇటీవల మృతిచెందిన ఇద్దరు బీఆర్ఎస్ కార్యకర్తలు గండి నారాయణ, గౌత్ర వెంకటేష్ కుటుంబాలకు ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ శనివారం బీమా చెక్కులు అందజేశారు. సుమన్ క్యాతనపల్లిలోని తన స్వగృహంలో రూ.2లక్షల చొప్పున విలువైన బీమా చెక్కులను అందజేశారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో న్యాయమూర్తి పూజలు


తీర్థప్రసాదం అందిస్తున్న ఆలయ ఈవో

దండేపల్లి: మండలంలోని గూడెం ఆలయంలో సత్యనారాయణస్వామిని బెల్లంపల్లి జూనియర్ సివిల్ న్యాయమూర్తి హిమబిందు కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలుకగా, అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

న్యూస్‌రీల్

'పది' పరీక్షలకు 63 మంది గైర్హాజర్


పరీక్ష కేంద్రం వద్ద డీసీపీ సుధీర్ ఆర్ కేకన్

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలకు శనివారం 63మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 55 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన గణితం పరీక్షకు 10,172మంది విద్యార్థులకు గాను 10,109మంది హాజరయ్యారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 10,125 మందికి గాను 10,074 మంది హాజరు కాగా 51 మంది గైర్హాజరు అయ్యారు. గతంలో ఫెయిలైన విద్యార్థులు 47 మందికి గాను 35 మంది హాజరు కాగా 12 మంది రాలేదు. చెన్నూర్ రోడ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించారు. పరీక్ష కేంద్రాలను డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు. డీఈవో వెంకటేశ్వర్లు 4, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ 2 పరీక్షా కేంద్రాలు, ఫ్లయింగ్‌స్క్వాడ్ 24 కేంద్రాలను తనిఖీ చేశారు.

నేటి నుంచి 'భట్టి' పాదయాత్ర

జైపూర్: హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర ఆదివారం నుంచి మళ్లీ కొనసానుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొనసాగుతున్న పాదయాత్ర మండలంలోని ఇందారం వరకు చేరగానే మంచిర్యాల బహిరంగ సభ వాయిదా నేపథ్యంలో మూడు రోజులు స్వల్ప విరామం ప్రకటించిన విషయం తెలిసిందే. ఆదివారం ఇందారం సమీపంలోని దుబ్బపల్లి క్యాంపు నుంచి తిరిగి ప్రారంభం కానుంది. రామారావుపేట మీదుగా సింగాపూర్ నుంచి మంచిర్యాల నియోజకవర్గం శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియం వరకు పాదయాత్ర సాగుతుంది. శనివారం విక్రమార్క జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశం అయ్యారు.

సంస్కృత అధ్యాపకుల నియామకం చేపట్టాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియెట్ సంస్కృత అధ్యాపకుల నియామకం వెంటనే చేపట్టాలని సంస్కృత అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో డీఐఈవో శైలజకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఆర్థికశాఖ అనుమతి పొంది పెండింగ్‌లో ఉన్న అధ్యాపకుల నియామకం చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్కృత అధ్యాపకుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అంబాల సమ్మయ్య, ఉపాధ్యక్షుడు బండి రవీందర్, కార్యదర్శి విజయ్‌ప్రకాశ్, కోశాధికారి సత్యనారాయణ, సభ్యులు దామోదర్, శైలజ పాల్గొన్నారు.

'10న కేకే ఓసీని అడ్డుకుంటాం'


దుబ్బగూడంలో సమావేశమైన గ్రామస్తులు

కాసిపేట: పునరావాసం కల్పించాలని ఈ నెల 10న కేకే ఓసీని అడ్డుకుంటామని మండలంలోని దుబ్బగూడెం గ్రామస్తులు, ఆర్‌అండ్‌ఆర్ కమిటీ సభ్యులు ప్రకటించారు. శనివారం సాయంత్రం వారంతా సమావేశమై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ వెంట ఉంటామని అధికారులు నమ్మించి పునరావాసం కల్పించడంలో జాప్యం చేస్తున్నారని విమర్శించారు. ఇళ్లకు సంబంధించిన డబ్బులు ఇచ్చి పునరావాసం చూపడం లేదని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఓసీలో పనిస్థలాలు గ్రామం దగ్గరకు వస్తుండడంతో బ్లాస్టింగ్‌లతో ఇబ్బందులు పడుతున్నామని, వర్షాకాలం వస్తున్నందున ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందని, వెంటనే స్థలాలు కేటాయించి పునరావాసం కల్పించాలని తెలిపారు. లేని పక్షంలో గ్రామస్తులంతా మూకుమ్మడిగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

డిప్యూటేషన్లు రద్దు

- శ్రీరాంపూర్ ఏరియాలో ఉత్తర్వులు
- పాత విధుల్లోనే చేరనున్న ఆ కార్మికులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: శ్రీరాంపూర్ ఏరియాలో వివిధ చోట్ల డిప్యూటేషన్లపై పని చేస్తున్న కార్మికులను తమ తమ పాత స్థానాలకు పంపిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు డిప్యూటేషన్‌లు రద్దు చేస్తూ ఉత్తుర్వులు వెలువడ్డాయి. ఏరియాలో వివిధ కారణాలతో రెగ్యులర్ గనుల్లో కాకుండా 107 మంది కార్మికులు ఉపరితల, సివిల్, ఓసీపీ, సీహెచ్‌పీ, ఎస్టేట్, పర్సనల్ తదితర విభాగాల్లో పని చేస్తున్నారు. వీరంతా భూగర్భంలో పని చేయాల్సి ఉండగా వివిధ కారణాలతో డిప్యూటేషన్లపై ఇతర విభాగాల్లోకి మారారు. ఇకనుంచి ఆ కార్మికులందరూ తిరిగి తమ పాత పనుల్లోనే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో మరోసారి డిప్యూటేషన్ ఉత్తర్వులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా డిప్యూటేషన్లు కార్మికుల సౌకర్యం కోసం కల్పించేవారు. ఇటీవల ఈ వ్యవహారంలో అక్రమాలు వెలుగు చూడడంతో కార్పొరేట్ స్థాయిలో ఫిర్యాదులు వెళ్లాయి. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన అక్రమ డిప్యూటేషన్లపై సింగరేణి విజిలెన్స్, స్టేట్ విజిలెన్స్ విచారణ చేపట్టారు. వాటిలో కొన్ని అక్రమమని తేలడంతో ఇప్పటికే కొందరిని తిరిగి తమ పూర్వపు పని చేసే చోటికి పంపించారు. వీటిపై విచారణ జరిగి కొందరిపై తాత్కాలికంగా సస్పెన్షన్ వేటు వేశారు.

అక్రమాలు


The Singareni Collieries Company Limited
Srirampur Area

డిప్యూటేషన్లు రద్దు చేస్తూ వెలువడిన ఉత్తర్వులు

గత కొంతకాలంగా సింగరేణిలో అక్రమంగా డిప్యూటేషన్లు సాగుతున్నట్లు కార్మికులే ఆరోపిస్తున్నారు. అవసరమున్న కార్మికుల కంటే అర్హత లేని వాళ్లే ఎక్కువగా పైరవీలు చేసుకుని దొడ్డిదారిన చేరుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక కార్మిక లీడర్లు, రాజకీయ పలుకుబడితో కోరుకున్న చోట విధుల్లో చేరుతున్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఓ ఉన్నతాధికారి డిప్యూటేషన్ల పేరుతో రూ.లక్షలు వసూలు చేసి రిటైర్డు అయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత జరిగిన విచారణలో అమాయక కార్మికులు, డబ్బులు ఇచ్చిన వాళ్లే మళ్లీ శిక్షలు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో డిప్యూటేషన్ల వ్యవహారం మరింత పారదర్శకంగా నిర్వహించాలని అన్ని ఏరియాల అధికారులకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆరు నెలల కంటే ఎక్కువగా ఎవరికీ అనుమతి ఇవ్వకపోవడంతోపాటు సరైన కారణంతో పాటు ఇక బదిలీలు అన్ని పారదర్శకంగానే జరపాలని నిర్ణయించారు. దీంతో ఇప్పటివరకు వేర్వేరు విభాగాల్లో పని చేస్తున్న కార్మికులను తిరిగి సొంత గనులకు పంపిస్తున్నారు.

యువ కార్మికులే అధికం

సాధారణంగా సీనియర్ కార్మికులు వయస్సు పైబడి అనారోగ్యం కారణంగా, లేక ఇతరత్రా సమస్యలతో భూగర్భ గనుల్లో విధులు నిర్వర్తించలేని పరిస్థితుల్లో డిప్యూటేషన్లు కోరుతారు. వీరికి తేలికపాటి పనులు అంటే ఉపరితల విధులైన ఓసీపీ, సీహెచ్‌పీ తదితర చోటుకు మార్చమని కోరుతారు. ఇటీవల సీనియర్ల కంటే యువ కార్మికులు, విద్యావంతులు అధికంగా భూగర్భ గనుల్లో పని చేయలేమని చెబుతూ వేరే మార్గాలు వెతుకుతున్నారు. పైరవీలతో వేరే చోటుకు బదిలీ వేసుకునేందుకు తమ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో అటు కార్మిక సంఘాల లీడర్లు, ఇటు ఉన్నతాధికారులకు ఈ బదిలీల వినతులు ఆదాయ వనరుగా మారుతున్నాయి. పేరుకు కార్పొరేట్ స్థాయి నుంచే డిప్యూటేషన్ల ఆర్డర్లు వస్తున్నప్పటికీ స్థానిక అధికారులే తతంగమంతా నడిపిస్తున్నారు. దీంతో అనర్హత ఉన్న కార్మికులు సైతం భూగర్భంలోని పనులు తప్పించుకునేందుకు తేలిక పనుల వైపు మొగ్గు చూపుతున్నారు.

మహనీయుల ఆశయాలను కొనసాగిద్దాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖనాయక్

జన్నారం: మహనీయుల ఆశయాలను కొనసాగించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో శనివారం తెలంగాణ నేతకాని మహార్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మహనీయుల జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బీఆర్.అంబేద్కర్, జ్యోతిరావుపూలే, జగ్జీవన్‌రామ్, కుమురంభీం, సావిత్రిబాయిపూలే, సేవాలాల్ మహరాజ్‌లకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రేఖానాయక్ మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంతోనే మహిళలు ఉన్నత స్థానంలో నిలిచారని, మహనీయుల జయంతి ఉత్సవాలను ఒకే వేదికపై నిర్వహించడం సంతోషదాయకమని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ జాడి ముసలయ్య, తెలంగాణ రాష్ట్ర ఐటీడీఏ చీఫ్ ఇంజినీర్ మురిమడుగుల శంకర్ మాట్లాడుతూ సమసమాజ స్థాపన కోసం మహనీయులు ఎంతో కృషి చేశారని, వారిని ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలని తలెఇపారు. కార్యక్రమంలో నేతకాని మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్‌నేత, హైదరాబాద్, ఐటీవో అధికారి ప్రకాష్, నేతకానిమహార్ కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్, వైస్‌ఎంపీపీ వినయ్‌కుమార్, సర్పంచ్ భూమేష్, హైకోర్టు అడ్వకేట్ దీపక్‌కుమార్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గంగాధర్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రియాజుద్దీన్, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభుదాస్, నాయకులు భరత్‌కుమార్, మున్వర్ అలీఖాన్, మురళి, విజేందర్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

'ఆందోళనలు ఢిల్లీలో చేయాలి'


మాట్లాడుతున్న నాయకులు

బెల్లంపల్లి: బీఆర్ఎస్, టీబీజీకేఎస్ శ్రేణులు స్థానికంగా పోరాటాల ఫోజులు కొట్టకుండా ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఢిల్లీకి వెళ్లి కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేయాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక టీఎస్‌టీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ విధానంలో భాగంగా మరోసారి బొగ్గు గనుల వేలానికి సిద్ధపడిందని విమర్శించారు. సింగరేణి కంపెనీకి చెందిన నాలుగు బ్లాక్‌లను వేలం వేయడానికి ముందుకు రావడం శోచనీయమని అన్నారు. బొగ్గు సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడానికి కేంద్రం తహతహలాడుతోందని విమర్శించారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావడంలో విఫలం చెందిందని అన్నారు. పోరాటాల ద్వారానే కేంద్ర ప్రభుత్వ విధానాలను అడ్డుకోవాలని, ఇందుకు అన్ని రకాల శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయలు ఎండి.చాంద్‌పాషా, పార్వతి రాజిరెడ్డి, టీ.మణిరాం సింగ్, ఎస్.రాజన్న, దేవి సత్యం, సురేందర్, శ్రీనివాస్, మనోహర్ పాల్గొన్నారు.

'ఉపాధి' పని భారం


కోటపల్లిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

- 310 పంచాయతీల్లో 161 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు
- ఒక్కొక్కరికి రెండు మూడు చోట్ల విధులు

కోటపల్లి: ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లపై పని భారం పెరిగింది. జిల్లాలో 310 గ్రామ పంచాయతీలు ఉండగా.. 161మంది మాత్రమే ఉండడంతో ఒక్కొక్కరు రెండు మూడు చోట్ల విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. గతంలో 209 పంచాయతీలు ఉండగా జిల్లా ఆవిర్భావం తర్వాత 310కు పెరిగాయి. అందుకు అనుగుణంగా కొత్తవారి నియామకం చేపట్టకపోవడంతో పాత పంచాయతీల వారిగానే పని చేస్తున్నారు. పంచాయతీని యూనిట్‌గా తీసుకుని ఉపాధి హామీ పథకం పనులు గుర్తించారు. ప్రతీచోట ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండాలి. కానీ అందుకు అనుగుణంగా నియామకాలు చేపట్టడంల ఏదు. ఒక్కరే ఆయా చోట్ల కూలీల హాజరు వేయడం, ఫొటోలు అప్‌లోడ్ చేయడం కష్టంగా మారింది. వేసవి నేపథ్యంలో మూడు నెలలపాటు పనులు జోరుగా సాగుతాయి. ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలు చేపడితే పరిస్థితి మెరుగయ్యే అవకాశం ఉంది. సరి పడా ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించకుండా కూలీల సంఖ్య పెంచాలని, వేతనాల బిల్లులు సకాలంలో చేయాలని, పనుల్లో నాణ్యత ఉండాలని ఉన్నతాధికారులు సూచించడం సరికాదని పేర్కొంటున్నారు. ఒకే రోజు అన్ని పనులు పరిశీలించడం సాధ్యం కాక మేట్లకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. వారు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో పనుల్లో పారదర్శకత లోపిస్తోంది. కూలీల సంఖ్య పెంచలేకపోతున్నారు. మస్టర్ల నమోదు, వేతనాల చెల్లింపుల్లో జాప్యం ఏర్పడుతోంది.

కొత్త సాఫ్ట్‌వేర్..

ఉపాధిహామీ పథకంలో గతంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించేవారు. అన్ని రాష్ట్రాల్లో ఒకే రకంగా ఉండాలని కేంద్రం ఆదేశించడంతో గత ఏడాది ఏప్రిల్ నుంచి కొత్త సాఫ్ట్‌వేర్ వినియోగిస్తున్నారు. దీనివల్ల మొదట్లో కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. పాత పంచాయతీల నుంచి విడిపోయి కొత్తగా ఆవిర్భవించిన వాటిల్లో కూలీలకు చెల్లింపులు ఆలస్యం అయ్యాయి. కూలీల పేర్లు రెండు చోట్ల నమోదు కావడంతో అధికారులు వాటిని వేరు చేశారు. ఆ సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు విధుల్లో లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులే పనులు పర్యవేక్షించారు.

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి



కొత్త గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం మా పరిధిలోది కాదు. ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం కొత్త పంచాయతీల్లో సీనియర్ మేట్లతో పర్యవేక్షణ కొనసాగుతోంది. నూతన గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

– శేషాద్రి, డీఆర్డీవో, మంచిర్యాల

బొగ్గు ఉత్పత్తికి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

శ్రీరాంపూర్: రాబోయే వర్షాకాలంలో ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కంపెనీ డైరెక్టర్లు తెలిపారు. శనివారం డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రెడ్డి(పీపీ), శ్రీని వాస్(ఆపరేషన్స్), సత్యనారాయణ(ఈఅండ్‌ఎం) వీడియో కాన్ఫరెన్సు ద్వారా జీఎంతో మాట్లాడారు. శ్రీరాంపూర్ నుంచి ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి పాల్గొని రెండు ఓసీపీల్లో వర్షాకాలం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. వర్షపు నీటిని క్వారీలో చేరకుండా ముందుగానే సర్ఫేస్‌లో డ్రైన్‌లు నిర్వహించుకోవాలని డైరెక్టర్లు సూచించారు. క్వారీలో చేరిన నీటిని కూడా పైకి తరలించేందుకు మోటార్ పంపులను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందారం ఓసీపీ పీఓ శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్, ప్రాజెక్టు ఇంజనీర్ రమేశ్ పాల్గొన్నారు.

నిమ్మకాయ @ 5


మార్కెట్‌లో నిమ్మకాయలు

నెన్నెల: ఎండలు పెరిగేకొద్దీ మార్కెట్లో నిమ్మకాయల ధర పైపైకి చేరుతోంది. ఒక్కో నిమ్మకాయ రూ.5 పలుకుతోంది. పెద్ద పరిమాణంలో ఉన్న నిమ్మకాయలను రూ.10కి ఒకటి విక్రయిస్తున్నారు. ఎండాకాలం వేడి నుంచి ఉపశమనం కోసం నిమ్మకాయ షర్బత్ తాగేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తుంటారు. ప్రస్తుతం రంజాన్ మాసం కావడంతో ముస్లింలు ఉపవాస దీక్ష విరమణకు నిమ్మకాయ షర్బత్‌ను తీసుకుంటారు. ఈసారి నిమ్మకాయలు కొనుగోలు చేసే పరిస్థితి లేదని పేదలు, మధ్యతరగతి ప్రజలు నిట్టూరుస్తున్నారు. హోటళ్లలోనూ ఒక్కో కాయను నాలుగైదు ముక్కలు చేసి వడ్డిస్తున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో చుక్కలదుప్పి మృతి



మృతి చెందిన చుక్కలదుప్పి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ శివారు ప్రాంతంలో బజారు ఏరియా నుంచి శాంతిఖని గనికి వెళ్లే మార్గంలో రోడ్డుపై చుక్కలదుప్పి మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న బెల్లంపల్లి అటవీశాఖ రేంజ్ అధికారి సుభాష్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో మృతి చెంది ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పంచనామా నిర్వహించి అటవీశాఖ నిబంధనల ప్రకారం కళేబరాన్ని ఖననం చేయించారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు

భీమారం(చెన్నూర్): గుడుంబా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు మంచిర్యాల ఎక్సైజ్ శాఖ సీఐ నరేందర్ తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు శనివారం భీమారం-చెన్నూర్ ప్రధాన రహదారిలోని బూర్గుపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గమనించిన నిందితుడు బైక్‌ని వదిలేసి పారిపోతుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అతని వద్ద పది లీటర్ల గుడుంబా లభ్యమైనట్లు ఆయన పేర్కొన్నారు. గుడుంబాతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడు చామన్‌పల్లికి చెందిన మాలోతు రమేశ్‌నాయక్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సై వసంతరావు, సిబ్బంది రాజేంద్రప్రసాద్, ఉమారాణి పాల్గొన్నారు.

కాసిపేటగనిలో కార్మికుడికి గాయాలు

కాసిపేట(బెల్లంపల్లి): మందమర్రి ఏరియాలోని కాసిపేటగనిలో శనివారం తెల్లవారు జామున జరిగిన ప్రమాదంలో కోల్‌కట్టర్ కార్మికుడు కాచు రాజ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. 19డిప్ 3సీంలో ఉల్లు కోస్తుండగా స్లాబ్ కూలి అతని భుజంపై పడింది. గమనించిన తోటి కార్మికులు వెంటనే చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో రాజ్‌కుమార్‌ను ఏజెంట్ కుర్మ రాజేందర్, గని అధికారులు పరామర్శించారు.

మద్యం మత్తులో ఒకరు మృతి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బనార్‌వాడకు చెందిన చాప్లె శంకర్ (39) మద్యం మత్తులో మృతి చెందినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్న శంకర్ శుక్రవారం మద్యం సేవించి ఇంట్లో పడుకున్నాడు. తల్లి చాప్లె బయ్యాబాయి లేపడంతో స్పందించలేదు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తల్లి బయ్యాబాయి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బెజ్జూర్: మండలంలోని మర్తడి గ్రామ సమీపంలో గల పెద్దవాగులో శనివారం ఎస్సై వెంకటేశ్ ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. రాజన్న, శ్రీను, అశోక్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్టుచేసి వారివద్ద నుంచి రూ.7వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

వీరి పేరేమి..!

సండే స్పెషల్

పిల్లలు పుట్టారంటే చాలు మంచి పేరు పెట్టాలనే తపన తల్లిదండ్రుల్లో కనిపిస్తుంది. జన్మనక్షత్రం.. ఇష్టదైవం.. కులదైవం పేరు, పేరులోని అక్షరమైన కలిసివచ్చేలా నామకరణం చేయాలనే ఆసక్తి అందరిలోనూ ఉంటుంది. ఇలా ఒకే రకమైన పేర్లు.. ఒకే ఊరిలో ఉన్న వారు చాలామందే ఉన్నారు. ఇంటి పేరు చెబితే గానీ వారి ఆచూకీ తెలియదంటే అతిశయోక్తి కాదు. ఆ పేర్ల వెనుక చరిత్ర ఏమిటో తెలుసుకుందాం.

– సాక్షి, మంచిర్యాలడెస్క్

- పిల్లలకు దేవుళ్ల పేర్లు
- ఒక్కో పేరు వెనుక ఒక్కో చరిత్ర



ఆదిలాబాద్‌లోని మహాపోచమ్మ ఆలయం(ఫైల్)

స్నేహానికి గుర్తు.. లచ్చుపటేల్



హైమన్‌డార్ఫ్ కొడుకు లచ్చుపటేల్



లచ్చుపటేల్‌తో హైమన్‌డార్ఫ్(ఫైల్)

మానవ శాస్త్రవేత్త హైమన్‌డార్ఫ్ ఆదివాసీల జీవన విధానం, సమస్యలపై అధ్యయనం చేయడానికి కొన్ని దశాబ్దాల క్రితం కుమురం భీం జిల్లా జైనూర్ మండలం మార్లవాయి గ్రామానికి వచ్చారు. అప్పట్లో ఆయనకు ఎవరూ ఇక్కడ ఆశ్రయం కల్పించలేదు. దీంతో గ్రామ పటేల్‌గా ఉన్న లచ్చుపటేల్ హైమన్‌డార్ఫ్, ఆయన భార్య ఎలిజబెత్‌కు గ్రామంలో ఆశ్రయం కల్పించాడు. ఆ తర్వాత హైమన్‌డార్ఫ్ పరిశోధనకు లచ్చుపటేల్ అన్ని రకాలుగా సహకరించాడు. ఈ క్రమంలో వారి మధ్య స్నేహం ఏర్పడింది. హైమన్‌డార్ఫ్ తన భార్య ఎలిజబెత్ ప్రసవం కోసం స్వదేశం లండన్‌కు వెళ్లారు. ఆయన తిరిగి వచ్చేసరికి తనకు ఆశ్రయం కల్పించిన లచ్చుపటేల్ చనిపోయాడని తెలిసి బాధపడ్డాడు. తమ స్నేహానికి గుర్తుగా హైమన్‌డార్ఫ్ తన కుమారుడికి లచ్చుపటేల్ అలియాస్ నికోలస్ అని నామకరణం చేశారు.

గజ్జలమ్మ ఆలయం

నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంలో గజ్జలమ్మ అమ్మవారి ఆలయం ఉంది. కొన్ని దశాబ్దాల క్రితం మూసరి వంశస్తులు వేటకు వెళ్లేవారు. ముత్యం అనే వ్యక్తికి నీటి మడుగులో రాతి విగ్రహం కనిపించిందని, కలలోకి వచ్చి విగ్రహం ప్రతిష్టించాలని చెప్పడంతో మరుసటి రోజు గ్రామ శివారులో ప్రతిష్టించారని కథనం ప్రచారంలో ఉంది. ప్రతీ ఆదివారం అమ్మవారికి మొక్కులు, నైవేద్యాలు చెల్లించుకుంటారు. అమ్మవారి పేరుమీదుగా పిల్లలకు పేర్లు పెడుతున్నారు. గ్రామంలో 1500కు పైగా జనాభా ఉన్నారు. అమ్మాయిలకు గజ్జవ్వ, గజ్జలమ్మ, అబ్బాయిలకు గజ్జారాం, పెద్ద గజ్జారాం, నడిపి గజ్జారాం అనే పేర్లు పెడుతుంటారు. ఇలా పేర్లు ఉన్నవారు చాలామంది ఉన్నారు. ఇప్పటికీ గజ్జారం, గజ్జలమ్మ పేరు పలికిన తర్వాతే ఏదైనా వేరే పేరు పెడుతుంటారు. అమ్మవారి భక్తులు ముంబయిలోనూ ఆలయం నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్టించారు. కుభీర్‌లోనూ అమ్మవారి పేరిట ఆలయం ఉంది.



పురాతన ఆలయం..

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని అడెల్లి గ్రామంలో మహాపోచమ్మ కొలువై ఉంది. పురాతనమైన ఈ ఆలయం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. నిజామాబాద్, వరంగల్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి ప్రతీ ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకుంటారు. అమ్మవారి పేరు మీదుగా పిల్లలకు పేర్లు పెడుతుంటారు. పోశెట్టి, పోసవ్వ, ఒకే ఇంట్లో ముగ్గురు ఉంటే పెద్ద పోశెట్టి, నడిపి పోశెట్టి, చిన్న పోశెట్టి అని నామకరణం చేస్తుంటారు. ఇక వ్యాపార సముదాయాలు, వాహనాలకు సైతం పోచమ్మ పేరు పెడుతుంటారు. పోచమ్మ మిల్క్ సెంటర్, అడెల్లి పోచమ్మ ఫాస్ట్ ఫుడ్, అడెల్లి పోచమ్మ కిరాణం ఇలా చాలావరకు వ్యాపార సముదాయాలకు పేర్లు ఉన్నాయి.

- మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం రేచిని గ్రామంలో కుర్మ కులస్తుల కుటుంబాలు 270 వరకు ఉన్నాయి. వీరిలో ఎక్కువగా బీరయ్య అనే పేరుగల వారే అధికంగా ఉన్నారు. దుర్కి బీరయ్య, మురికి బీరయ్య, ముదిగిరి బీరయ్య, చిన్న బీరయ్య, నడిపి బీరయ్య ఇలా 30మందికి పైగా ఉన్నారు.
- నిర్మల్ జిల్లా భైంసా మండలం చుచుంద్ గ్రామంలో సుమారు 1400 జనాభా ఉంటారు. గ్రామంలో సిద్ధేశ్వరాలయం ఉంది. దేవుడి పేరు మీదుగా పిల్లలకు పేర్లు పెడుతుంటారు. సిద్ధేశ్వర్, సిద్ధు, సిద్ధయ్య, సిద్ధాంత్ ఇలా గ్రామంలో ఇంటికొకరు ఉన్నారు.
- నిర్మల్ జిల్లా కుభీర్ మండలం పార్డి(బీ)లో రాజరాజేశ్వర ఆలయం ఉంది. దీంతో గ్రామంలో ఎక్కువ మంది తమ పిల్లలకు ఆ దేవుళ్ల పేరు కలిసి వచ్చేలా పెడుతుంటారు. పెర్క రాజేశ్వర్, తూము రాజేశ్వర్, రాజన్న, జంగం రాజన్న, జంగాల రాజేశ్వర్, చిమ్మన్ రాజేశ్వర్, ఈర్ల రాజేశ్వర్, గుడాల రాజలింగు, కోలుకొండ రాజేశ్వర్, పొట్టొళ్ల రాజేశ్వర్, వడ్ల రాజన్న, శాల రాజేశ్వర్, చిట్యాల రాజేశ్వర్, తిమ్మాపూర్ రాజేశ్వర్, శేరె రాజేశ్వర్, కన్నాల రాజన్న, తిప్ప రాజేశ్వర్, గోపు రాజేశ్వర్, ప్యారామూర్ రాజేశ్వర్, కుర్మ రాజేశ్వర్, రాజవ్వ, రాజమణి, రాజేశ్వరి ఇలా సుమారు 500 మంది వరకు ఉంటారు.
- నిర్మల్ జిల్లా తానూరు మండలం బొంద్రట్ గ్రామంలోని గుట్ట ప్రాంతంలో అమృత్ సాబ్ ఆలయం ఉంది. ఆ గ్రామంలో ఎక్కువగా అమృత్ పేర్లు ఉన్నాయి. చిన్న అమృత్, పెద్ద అమృత్, నడిపి అమృత్ పేర్లు ఉన్నాయి. ఆలయంలో ఇక్కడి గ్రామాల ప్రజలు మొక్కులు చెల్లించుకోవడంతోపాటు అబ్బాయిలు జన్మిస్తే ఎక్కువగా ఇదే పేరు పెడుతుంటారు.

ఇష్టదైవం..

లక్ష్మణచాంద మండలం పొట్టపెల్లి(కే) గ్రామంలో వెయ్యి మందికి పైగా జనాభా ఉన్నారు. వీరిలో 100 నుంచి 150 మంది వరకు సాయన్న పేరు గలవారు ఉన్నారు. సాయన్న, నడిపి సాయన్న, పెద్ద సాయన్న అనే పేర్లు ఎక్కువగా వుంటాయి. బాల్కొండలో ఉన్న తమ ఇష్ట దైవం పేరిట పిల్లలకు పేర్లు పెడుతుంటారు. పిల్లల పుట్టు వెంట్రుకలు అక్కడే తీసి కందూరు చేసి పేర్లు పెడుతుంటారు.

ప్రతీ ఇంటా అమ్మవారి పేర్లు



కుంటాలలో వెలిసిన గజ్జలమ్మ దేవి భక్తుల కోరికలను నెరవేర్చడంతో ప్రతి ఇంటా అమ్మవారి పేర్లను పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మా కుటుంబంలో అక్కకు గజ్జలమ్మ అని, ఇద్దరం అన్నదమ్ములకు చిన్న గజ్జారాం, పెద్ద గజ్జారాం అని పేర్లు పెట్టారు. నిత్యం అమ్మవారిని కొలిచినట్టుగా భావిస్తుంటాం. అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లే.

– ఆప్క చిన్న గజ్జారాం, ఆప్క పెద్ద గజ్జారాం, కుంటాల

శివరాత్రికి పుట్టువెంట్రుకలు తీస్తారు..



మా గ్రామంలో ఉన్న ఆలయం 500 ఏళ్ల పురాతనమైనది. అందువల్లే ఎక్కువ మంది తమ పిల్లలకు దేవుని పేరు పెట్టుకుంటారు. ప్రతీ శివరాత్రికి ఆలయంలో దేవుని కల్యాణం జరిపిస్తాం. ఆ కల్యాణం జరిగిన తర్వాతే గ్రామంలో పెళ్లిళ్లు జరుగుతాయి. దేవుని పేరు పెట్టిన పిల్లల పుట్టువెంట్రుకలు శివరాత్రి రోజు మాత్రమే ఆలయం వద్ద తీస్తారు. ఇది తరతరాల ఆనవాయితీగా వస్తోంది.

– తూము రాజేశ్వర్, పార్డి(బి), మం: కుభీర్

మా ఊర్లో 150 మందికి అవే పేర్లు



నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం పొట్టపెల్లి(కే) మా గ్రామం. మా కుల దైవం తుర్కదేవుడు బాల్కొండ గ్రామంలో ఉంది. దీంతో మా దేవుని పేరుతోనే మా తాతలు, నాన్నలు, ఇప్పుడు మా పేర్లు, మా పిల్లల పేర్లు ఉన్నాయి. మేము ముగ్గురు అన్నదమ్ములం. నేను చిన్న వాడిని. దీంతో నా పేరు చిన్న సాయన్న అని పెట్టారు. మా అన్నల పేర్లు పెద్ద సాయన్న, నడిపి సాయన్నగా ఉంది.

– చిన్న సాయన్న, పొట్టపెల్లి(కే)

‘బలగం’ రైటర్‌కు సన్మానం



రమేశ్‌ను సన్మానిస్తున్న అధికారులు

మందమర్రిరూరల్(చెన్నూర్): బలగం సినిమా రైటర్ ఎలిగేటి రమేశ్, అతని తల్లి భూలక్ష్మిని శనివారం మందమర్రి ఏరియాలోని సివిల్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. భూలక్ష్మి సివిల్ డిపార్ట్‌మెంట్‌లో జనరల్ మజ్దూర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందింది. ఈ సందర్భంగా డీజీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ బలగం సినిమా ఎంతో బాగుందని, మరిన్ని మంచి కథలతో సినిమాలు అందించి ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ జయప్రకాశ్, సూపర్‌వైజర్ సతీష్, టీబీజీకేఎస్ పిట్ సెక్రటరీ తిరుపతి, నాయకులు బిక్షపతి, ఫిట్టర్ జగన్, సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘బలగం’తో కదిలొచ్చి..

దండేపల్లి(మంచిర్యాల): కుటుంబ అవశ్యకతను తెలిపే బలగం సినిమా ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. సినిమాను పలు గ్రామాల సర్పంచ్‌లు ఆయా గ్రామాల్లో ఉచితంగా ప్రదర్శిస్తున్నారు. దండేపల్లి మండలం తాళ్లపేట, నర్సాపూర్ గ్రామాల్లో శనివారం రాత్రి సినిమా ప్రదర్శించారు.



తాళ్లపేటలో బలగం సినిమా వీక్షిస్తున్న ప్రజలు

మూణ్నాళ్ల ముచ్చటేనా?

- భీమారంలో వెలగని విద్యుత్ దీపాలు
- నామ్‌కేవాస్తేగా సెంట్రల్ లైటింగ్

భీమారం(చెన్నూర్): మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారిలోని భీమారంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ నామ్‌కే వాస్తేగా ఉన్నాయి. గత నెల 15న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు చేతుల మీదుగా ఎంతో ఆర్భాటంగా సెంట్రల్ లైటింగ్ ప్రారంభించారు. అయితే వారం రోజుల పాటు జాతీయ రహదారిలో దాదాపు 3 కిలోమీటర్ల మేర ప్రకాశవంతమైన వెలుగులు ఇచ్చాయి. ఇంతకాలం రహదారిపై చీకటితో ఇబ్బందులు పడ్డ వాహన చోదకులు వెలుగులుచూసి సంతోషపడ్డారు. కానీ వారి సంతోషం మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది. మంత్రి పర్యటన నేపథ్యంలో హడావుడిగా పనులు చేపట్టిన అధికారులు పనులు పూర్తికాకుండానే ట్రాన్స్‌ఫార్మర్లు బిగించి చేతులు దులుపుకున్నారు. ప్రారంభించే ముందు సెంట్రల్ లైటింగ్ స్తంభాలు ప్రతీది తనిఖీ చేయాల్సి ఉండగా అధికారులు అవేం పట్టించుకోలేదు. ప్రస్తుతం స్తంభాలకు విద్యుత్‌షాక్ వస్తుందని సరఫరా నిలిపివేశారు. దీంతో పది రోజులుగా జాతీయ రహదారిపై అంధకారం నెలకొంది. సెంట్రల్ లైటింగ్ సిస్టంకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాల్సిన సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాహనదారులు పేర్కొంటున్నారు. జాతీయ రహదారిపై ఉన్న వీధిదీపాలపైనే ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఇక పల్లెల పరిస్థితి అర్థం చేసుకోవచ్చని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు చేసి వెలుగులు ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.



అంధకారంలో భీమారం బస్టాండ్ ప్రాంతం

ఉన్నతాధికారులకు సమాచారం అందించాం

భీమారంలో జాతీయ రహదారిపై అంధకారం తొలగించేందుకు రోడ్డు నిర్మాణ సంస్థ కాంట్రాక్టర్లు చర్యలు చేపట్టడంలేదు. పలుచోట్ల స్తంభాలకు విద్యుత్ షాక్ వస్తుందని ఫిర్యాదులు రావడంతో సరఫరా నిలిపివేశారు. మరమ్మతులు చేపట్టడంపై ఉన్నతాధికారులకు సమాచారం అందించాం.

– శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, భీమారం

విభజన హామీలు అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో ఇచ్చిన విభజన హామీలను కేంద్రం వెంటనే అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.తిరుపతి డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్రమోదీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా శనివారం సీపీఐ ఆధ్వర్యంలో గోలేటిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లజెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారని, సింగరేణి గనులను ప్రైవేటుకు అప్పగించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి జగ్గయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాయిల్ల నర్సయ్య, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రహీం, మండల అధ్యక్షుడు రవికుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి, మండల అధ్యక్షుడు సాయి, కార్యదర్శి బాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల నిరసన

మోదీ పర్యటనకు వ్యతిరేకంగా బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీతో పాటు ఏరియా వర్క్‌షాప్, స్టోర్స్ లలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ బొగ్గు బావులను ప్రైవేటీకరించటంతో పాటు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శులు శ్రీనివాస్, రెహమాన్, పిట్ కార్యదర్శి రాజేశ్, నాయకులు అంజయ్య, దేవీ శ్రీను, రాజు, పోశం, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన తేజశ్రీ



అభినందిస్తున్న కరస్పాండెంట్

మంచిర్యాలఅర్బన్: జిల్లా చెస్ అసోసియేషన్, తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ సంయుక్తంగా మందమర్రిలో నిర్వహించిన అండర్-17 చెస్ పోటీల్లో స్థానిక ది హ్యాపీ స్కాలర్ స్కూల్ విద్యార్థి తేజశ్రీ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికై ంది. హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న పోటీల్లో సదరు విద్యార్థిని పాల్గొననుంది. తేజశ్రీని పాఠశాల కరస్పాండెంట్ విక్రమ్‌రావు, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి

జైపూర్(చెన్నూర్): బొగ్గు ఉత్పత్తిలో ఇందారం ఐకే1ఏ గని, ఐకే-ఓసీపీ ప్రాజెక్టులకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇదే ఒరవడితో రాబోయే రోజుల్లో ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. శనివారం 2023–2024 ఆర్థిక సంవత్సరంలో సాధించాల్సిన ఉత్పత్తి లక్ష్యాల సాధనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకత సాధించాలన్నారు. సమావేశంలో పీవో శ్రీనివాస్, మేనేజర్ రవికుమార్, ఆపరేషన్స్ మేనేజర్లు బ్రహ్మాజీరావు, నాగన్న, ఏరియా ఇంజినీర్ రమేశ్, డీజీఎం శివరావు, ఏరియా రక్షణాధికారి కిరణ్ పాల్గొన్నారు.

బస్సు ఢీ కొని బాలికకు గాయాలు

భైంసారూరల్(ముధోల్): మండలంలోని దేగాం గ్రామంలో శనివారం ఆర్టీసీ బస్సు ఢీ కొని బాలికకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన బాలిక సావిత్రి మలవిసర్జన కోసం రోడ్డు దాటుతుండగా నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో బాలికకు తీవ్రగాయాలు కావడంతో 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కాస్మొటిక్ చార్జీలు వచ్చేదెప్పుడో?

- ముగుస్తున్న విద్యాసంవత్సరం
- ఇప్పటికీ విడుదల కాని నిధులు
- ఇబ్బందుల్లో విద్యార్థినులు

దండేపల్లి(మంచిర్యాల): విద్యాభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేస్తోందని ప్రజాప్రతినిధులు వివిధ సభలు, సమావేశాల్లో గొప్పలు చెప్తుంటారు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఆచరణలో కొన్ని కార్యరూపం దాల్చడం లేదని తెలుస్తోంది. కస్తూరిబా విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినులకు ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి కాస్మొటిక్ చార్జీలు ఇవ్వలేదు. దీంతో విద్యార్థినులే సొంత డబ్బులతో కొనుగోలు చేసుకుని కాలం వెల్లదీస్తున్నారు. సబ్బులు, కొబ్బరినూనె, పేస్టు, తదితర సామగ్రి కలుపుకుని ఒక్కో విద్యార్థినికి నెలకు వంద రూపాయల చొప్పున అందజేస్తోంది. కానీ ఈ ఏడాది విద్యాసంవత్సరం ముగిసిపోతున్నా ఇప్పటికీ వాటికి సంబంధించిన ఊసే ఎత్తడంలేదు.

జిల్లాలో 18 కేజీబీవీలు

మంచిర్యాల జిల్లాలో 18 కస్తూరిబా పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 9 పాఠశాలలను ఇంటర్మీడియెట్ వరకు అప్‌గ్రేడ్ చేశారు. 18 పాఠశాలల్లో మొత్తం 4,604 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదివేది ఎక్కువగా నిరుపేద విద్యార్థినులే. వారికి గత జూన్ (విద్యాసంవత్సరం ప్రారంభం) నుంచి ప్రభుత్వం కాస్మొటిక్ చార్జీలు చెల్లించక పోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయాలని కేజీబీవీ విద్యార్థినులు కోరుతున్నారు.



దండేపల్లిలోని కస్తూరిబా విద్యాలయం

నిధులు విడుదల కాలేదు

కాస్మొటిక్ బిల్లులు నేరుగా ఖాతాల్లో జమ చేస్తామని చెప్పడంతో విద్యార్థినుల బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించి పంపించాం. నిధులు ఇంకా విడుదల కాలేదు. నిధులు విడుదల కాగానే విద్యార్థినుల ఖాతాల్లో జమ అవుతాయి.

– పద్మజ, సెక్టోరియల్ అధికారి